
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 ఏప్రిల్ 2025



పైసా వసూల్..!

నంద్యాల మార్కెట్ యార్డులో ఓ కీలక అధికారి వివిధ రూపాల్లో సాగిస్తున్న దందా పలు విమర్శలకు తావిస్తోంది. యార్డు పరిధిలోని గోడౌన్ల అద్దె ముసుగులో ప్రతి నెల ఎక్కువ మొత్తం వసూలు చేసి.. రికార్డుల్లో తక్కువ నమోదు చేసి సదరు అధికారి సొమ్ముచేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు చెక్‌పోస్టులు, పశువుల సంత, పలు గోడౌన్లు, పలు రకాలు మిల్లుల రెన్యువల్‌లో తమదైన శైలిలో అక్రమ వసూళ్లకు తెరలేపారని సమాచారం. మొత్తంగా వివిధ రూపాల్లో ప్రతినెలా అక్రమ వసూళ్ల రూపంలో సదరు అధికారికి కాసుల వర్షం కురుస్తోందని ఆ శాఖ వర్గాల్లో జోరుగా చర్చసాగడం పలు విమర్శలకు తావిస్తోంది. నంద్యాల నగరంలోని మార్కెట్ యార్డులో 15 గోడౌన్లు ఉన్నాయి. ఇందులో సుమారు 10 గోడౌన్ల వరకు ఇతరులకు అద్దెకు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇదే అదనుగా భావించి సదరు అధికారి సైతం తమదైన శైలిలో ఎక్కడికక్కడ చేతి వాటం ప్రదర్శించి లక్షల్లో అక్రమంగా పోగు చేసుకుంటున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. గోడౌన్ అద్దెలు భారీగా కలెక్ట్ చేస్తూ.. రికార్డుల్లో మాత్రం తక్కువ నమోదు చేస్తున్నారనే చర్చ ఆ శాఖ వర్గాల్లో సాగుతోంది.





అద్దె ఇచ్చిన గోడౌన్‌లు ఇలా..

- మార్కెట్ యార్డులో ఓ అధికారి వసూళ్ల పర్వం
- గోడౌన్ల అద్దె ముసుగులో అధిక వసూళ్లు?
- రికార్డుల్లో తక్కువ నమోదు
- లక్షల్లో అక్రమ ఆదాయం
- పశువుల సంత.. రెన్యువల్స్‌లోనూ చేతి వాటం
- ఏళ్ల తరబడి అధికారి తీరు వివాదాస్పదం

నంద్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):

అన్నింటా అనుమానాలే!

విశ్వసనీయ సమాచారం మేరకు.. సదరు మార్కెట్ యార్డు పరిధిలోని ఆరు గోడౌన్ల నుంచి అద్దెకు తీసుకున్న వారి నుంచి ఒక్కొక్కరితో నెలకు రూ.26 వేలు వసూలు చేస్తుండగా రికార్డుల్లో మాత్రం అద్దె రూపంలో ఒక్కో గోడౌన్‌కు రూ.10 వేలు అద్దె, జీఎస్టీ రూ.1,800 చొప్పున మొత్తంగా రూ.11,800 మాత్రమే చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు సమాచారం. అదే విధంగా మరో మూడు గోడౌన్లను మాత్రం అగ్రిమెంట్ రూపంలో అద్దెకు ఇచ్చి వారు చెల్లించే మొత్తం అమౌంట్‌ను క్రమం తప్పకుండా రికార్డుల్లో నమోదు చేస్తున్నారని తెలిసింది. ఎందుకంటే అగ్రిమెంట్ ఉంది కదా..? అని చెబుతున్నారు. అయితే సదరు గోడౌన్లలోని ఓ వ్యాపారి మాత్రం గోడౌన్ ముందు వచ్చే కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా అనధికారికంగా షెడ్డు వేసుకున్నారు. ఈ అనధికార షెడ్డుకు కూడా ప్రతి నెలా రూ.10వేల చొప్పున డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఆ మొత్తం ఇవ్వకపోవడంతో షెడ్డుకు తాళం వేశారు. తర్వాత ప్రతి నెలా రూ.4వేలకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. వీటితో పాటు మరో గోడౌన్‌ను ఇరిగేషన్ వారికి అద్దెకు ఇచ్చారు. అయితే ఆ గోడౌన్‌ను రెండు పార్టులుగా విభజించి ప్రతి నెలా రూ.85 వేలు వసూలు చేస్తూ రికార్డుల్లో మాత్రం రూ.55వేలు చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు గోడౌన్‌కు జీఎస్టీ కూడా కట్టడం లేదని తెలిసింది. అదేవిధంగా సివిల్ సప్లైస్‌లోని ఓ పార్టు అద్దె తీసుకున్న ఓ కంపెనీ వ్యాపారి నుంచి నెలనెల సదరు అధికారి రూ.30 వేలు చొప్పున మొదటి మూడు నెలలు తీసుకున్నారని సమాచారం. సదరు గోడౌన్‌కు అగ్రిమెంట్ చేసి ప్రతినెలా రూ.30 వేలు అద్దె చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఇదే తరహాలో మరో ఫ్రూట్స్ గోడౌన్ విషయంలో అద్దె నెలకు రూ.36 చొప్పున మూడు నెలలకు కలిపి రూ.1.08 లక్షలు స్వాహా చేసి ఆ తర్వాత అద్దె అగ్రిమెంట్ చేసినట్లు తెలిసింది.

నూనెపల్లిలోనూ అంతే..!

నంద్యాలలోని నూనెపల్లిలో షాపులను కొన్నింటికి అగ్రిమెంట్ చేయకుండానే అద్దెకు ఇచ్చినట్లు తెలిసింది. అయితే వారి నుంచి అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్నారని తెలిసింది. పైగా సదరు అద్దెలకు రసీదులు కూడా ఇవ్వకుండా రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారని ఆ శాఖలోని కొందరు అధికారుల ద్వారా తెలిసింది. నూనెపల్లి పశువుల సంత నుంచి కూడా సిబ్బందిని బెదిరించి ప్రతివారం రూ.15 వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదేళ్లకు ఒకసారిగా రెన్యువల్ చేసే పలు గోడౌన్లు, దాల్ మిల్లులు తదితర వాటిని రెన్యువల్ చేయడంలోను సదరు అధికారి చేతివాటం ప్రదర్శించి క్యాష్ చేసుకున్నారని సమాచారం. గత వైసీపీ హయాంలో సదరు మార్కెట్ బోర్డు మీటింగ్ పెట్టకుండా.. ఇష్టారాజ్యంగా బిల్లులు డ్రా చేశారు. ఆ బిల్లులను బోర్డు మీటింగ్‌లో పెడితే కొందరు డైరెక్టర్లు విభేదించడంతో అప్పట్లో ఈ విషయం చర్చనీయాంశమైంది. చేయని వాటికి కూడా బిల్లులు పెడితే ఎలా అని కీలక అధికారిని డైరెక్టర్లు నిలదీశారు. ఈ వ్యవహారంలో అప్పటి చైర్మన్‌కు కొంత వాటా ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా రెండు తనిఖీ కేంద్రాలు, మొబైల్ డ్యూటీ నుంచి సిబ్బందిని బెదిరించి నెలనెల రూ.37 వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారని సమాచారం. మొత్తంగా అక్రమార్జనే లక్ష్యంగా సదరు అధికారి పనిచేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎవరైనా ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే వారిపై సదరు అధికారి చుక్కలు చూపిస్తారని బాధితులు అంతర్గతంగా ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బాధిత వ్యాపారులు, మార్కెటింగ్ శాఖలోని కొందరు అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా అద్దె వసూలు చేసినా ఎక్కువ మొత్తంలో వసూలు చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అద్దెదారులు కూడా అద్దె చెల్లించిన తరువాత రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎంత చెల్లిస్తే అంతకే బిల్లు తీసుకోవాలి. ఒకవేళ రసీదు ఇవ్వకపోతే మాకు ఫిర్యాదు చేయండి

- శ్రీకాంత్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్, కడప



కంది రైతుల ఖాతాల్లో నగదు జమ

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి సేకరించిన 4,500 మెట్రిక్ టన్నుల కందులకు గాను ఇప్పటి దాకా రూ.31,01,31,350 రైతుల ఖాతాల్లో జమ చేశామని మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. నంద్యాలలోని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో కందుల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఇప్పటికే 4,500 మెట్రిక్ టన్నులను క్వింటం రూ.7550 ప్రకారం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించిన నాలుగు రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. మరో 60లక్షల రూపాయలను ఒకటి, రెండురోజుల్లో జమచేస్తామని తెలిపారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈనెల 21వ తేదీ వరకు కందులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.



కందుల నాణ్యతను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ అధికారి

విద్యుత్ బిల్లుల భారం తగ్గించండి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం సూర్యఘర్, కుసుం పథకం అమలుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి విద్యుత్ అధికారులు, వెండర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 87,632 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్య ఘర్ సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని ప్రతి నియోజకవర్గంలో 10వేల ఇళ్లపై సోలార్ పలకలు ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించడంతో ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుధాకర్‌కుమార్, టెక్నికల్ ఈఈ నాగేశ్వరరావు, నంద్యాల ఈఈ శ్రీనివాసులురెడ్డి, డోన్ ఈఈ కమలాకరరావు, ఎల్‌డీఎం రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జేసీ విష్ణుచరణ్



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరకు జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జేసీ విష్ణుచరణ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జొన్నల కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతులందరూ కనీస మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. జిల్లాలో పండించిన జొన్నలు హైబ్రిడ్ రకం సి-43/మహేంద్ర రకం కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ప్రారంభమైన 'పది' పరీక్షల మూల్యాంకనం

- విధుల్లో 1,339 మంది ఉపాధ్యాయులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌డీఆర్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం 1339 మంది ఉపాధ్యాయులతో ప్రారంభమైంది. ఉదయం 9గంటలకే ఉపాధ్యాయులు కేంద్రానికి చేరుకుని 11గంటలకు మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ప్రతి ఉపాధ్యాయుడు 40 పేపర్లను మూల్యాంకనం చేసేవిధంగా డీఈవో జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. డీఈవో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. దీంతో మూల్యాంకనం కోసం 168 చీఫ్ ఎగ్జామినర్లు, 966 మంది సహాయ ఎగ్జామినర్లు, 205 మంది ప్రత్యేక సహాయకులను నియమించామని తెలిపారు. జిల్లాకు 1,90,000 జవాబు పత్రాలను కేటాయించారని, మూల్యాంకనం కోసం నియమించిన ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అనివార్య కారణాల వల్ల రాలేకపోయిన ఉపాధ్యాయుల స్థానంలో వేరొకరిని నియమించేందుకు అదనంగా మరో 30 మంది ఉపాధ్యాయులను సిద్ధంగా ఉంచామన్నారు. మొదటి రోజు ఉపాధ్యాయులకు ఏదైనా అసౌకర్యంగా ఉంటే గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

ఉపాధ్యాయుల అసంతృప్తి

మూల్యాంకనం కేంద్రంలో సరిపడా మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేవని పలువురు ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్కూలు ఉపాధ్యాయులకు, ఇతరులను కూడా ఒకే గేటు నుంచి పరీక్ష కేంద్రాల మీదుగా రాకపోకలు సాగించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అసలే ఎండాకాలం కావడం ఉష్ణోగ్రత తీవ్రస్థాయిలో ఉన్నా రేకుల షెడ్డుతో ఉన్న ఆడిటోరియంలో సుమారు వంద మందికి పైగా ఉపాధ్యాయులు మూల్యాంకనం విధులు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జిల్లాలో 2.16 లక్షల పింఛన్లు

- ప్రతి నెలా రూ.93 కోట్ల అందజేత
- జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సదరం క్యాంప్, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, ఔషధ నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 2.16 లక్షల పింఛన్లు ఉన్నాయని, ప్రతి నెలా రూ.93 కోట్ల పింఛన్ దారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. వృద్ధాప్య, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో దివ్యాంగుల రీ వెరిఫికేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, వివిధ రకాల దివ్యాంగులు 25వేల మంది ఉన్నారని అలాగే 900 మెడికల్ పింఛన్‌దారులున్నారన్నారు. వీరందరికీ రీ వెరిఫికేషన్ చేసేందుకు జిల్లా కేంద్రంలో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వస్తున్న దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. వారానికి 900 పింఛన్లు రీ వెరిఫికేషన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. వెంకటరమణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ మెప్పు కోసం

కలెక్టర్ తనిఖీకి వస్తున్న సమాచారం తెలుసుకున్న జీజీహెచ్ శానిటరీ ఇన్‌చార్జి అవసరంలేని పిచ్చిమొక్కలను మిషన్ ద్వారా తొలగించడం గమనార్హం. పిచ్చిమొక్కలు ఏపుగా ఉన్నచోట ఏనాడూ శుభ్రం చేయని శానిటరీ సిబ్బంది గురువారం కలెక్టర్ మెప్పు కోసం పని చేయడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పేరుకే రైతు బజార్..!

- గత ప్రభుత్వంలో రైతులను తరిమి.. దళారుల తిష్ఠ
- కాసులు కురిపిస్తున్న షాపులు
- దళారుల పెత్తనం తట్టుకోలేక పోలీస్‌స్టేషన్లకు వెళ్తున్న అధికారులు
- షాపులు, హోటళ్ల కేటాయింపుల్లో చేతివాటం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు పండించే రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకే అందించేందుకు ఏర్పాటు చేసిన రైతుబజార్లు క్రమంగా అధికారుల జేబులు నింపే ఆదాయ వనరులుగా మారాయి. ఈ రైతుబజార్లలో మచ్చుకైనా రైతులు కనిపించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ ఎలక్ట్రానిక్ కాటాలనే వినియోగించాలి. అవి కూడా రైతు బజార్లలో కనిపించడం లేదు. బోర్డుపై ఒక ధర రాసి, మరో ధరకు వ్యాపారులు అమ్ముతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్వహణలో రైతుబజార్లు నడుస్తున్నా అడుగడుగునా వీటిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మార్కెట్ యార్డుల్లో హోల్‌సేల్ ధరలకు వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేసి ఆటోల్లో వీటిని రైతుబజార్లకు తరలించి రెట్టింపు ధరలు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని రైతుబజార్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకే అందించడానికి, కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి రైతుబజార్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చిన జగనన్న పాలనలో ఆ లక్ష్యం నీరుగారిపోయింది. కర్నూలు సీ.క్యాంపు రైతుబజార్‌లో కాస్తో.. కూస్తో ఒకరిద్దరు రైతులు కనిపిస్తున్నా అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతు బజార్లలో రైతులు లేరు. రైతుబజార్లలో వ్యాపారులే తిష్టవేశారు. రైతులకు గుర్తింపు కార్డుల జారీలో గుర్తింపు అవకతవకలు చోటు చేసుకున్నాయి. జిల్లా కేంద్రంలోని సి. క్యాంప్ రైతుబజార్‌లో దళారులే ప్రతిరోజూ తెల్లవారుజామున కర్నూలు మార్కెట్‌యార్డులో హోల్‌సేల్ ధరకు కూరగాయలు కొని వాటిని రైతుబజార్లకు తీసుకెళ్లి రెట్టింపు ధరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ రైతుబజార్లలో ఒక్క కాటా కూడా సరిగ్గా లేదని, బోర్డుపై నమోదు చేస్తున్న ధరలకు కూరగాయలు విక్రయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. షాపుల, హోటళ్ల కేటాయింపులో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు, ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలను అందించేందుకని ప్రభుత్వం జిల్లాలో రూ. 2 కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన రైతుబజార్లు ప్రస్తుతం అధికారులకు జేబులు నింపే మార్గాలుగా మారాయి. కర్నూలు నగరంలోని సి.క్యాంప్, కొత్తపేట, అమీన్‌అబ్బాస్‌నగర్, నంద్యాల, ఆదోని రైతుబజార్లలో తనిఖీలు జరిగాయి. వీరి తనిఖీల్లో అడుగడుగునా అక్రమాలు వెలుగు చూశాయి.



కొత్తపేట రైతుబజారు

మిగతా 6వ పేజీలో

వైభవం.. జ్యోతి ఉత్సవం

500కు పైగా జ్యోతులతో చౌడేశ్వరీ మాతకు నివేదన ● నందవరానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు


అమ్మవారి జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు


జ్యోతులతో అగ్నిగుండం దాటుతున్న భక్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తి క్షేత్రమైననందవరం చౌడేశ్వరిదేవి ఆలయం జ్యోతులతో హోరెత్తింది. ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన జ్యోతి మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. లక్షలాది మంది భక్తులు జ్యోతి ఉత్సవాలకు హాజరయ్యారు. 500కు పైగా జ్యోతులను అమ్మవారికి నివేదనగా సమర్పించారు. అమ్మవారి జ్యోతి మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ జి.కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భాస్కరయ్య ఆచారి సంప్రదాయంగా అమ్మవారికి దిష్టిచుక్క పెట్టిన అనంతరం జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి 2 గంటలకు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి జ్యోతి మహోత్సవం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొగటవీర క్షత్రియులు అమ్మవారి జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నడిచి గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతులను అమ్మవారికి సమర్పించారు. అర్ధరాత్రి 2 గంటలకు ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు శనివారం ఉదయం 11 గంటల వరకు సాగింది. కాగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ జ్యోతులను మోసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.


నందవరం శ్రీచౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాల సందర్భంగా గండా దీపం మోస్తున్న రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి అర్ధరాత్రి నుంచి నిరంతరాయంగా భక్తులు చౌడేశ్వరిదేవి దర్శించుకునే అవకాశం కల్పించారు. ఆలయ నిత్యాన్నదాన సత్రంతో పాటు పలు నిత్యాన్న సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు. మహాసిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో భక్తులు నిమ్మరసం పంపిణీ చేశారు. వైద్యఆరోగ్యశాఖ, మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. ఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రుడు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం నందవరం గ్రామంలో నిర్వహించిన చౌడేశ్వరిదేవి రథోత్సవం వైభవంగా సాగింది.


జ్యోతి ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

పేరుకే రైతు బజార్..!

5వ పేజీతరువాయి

కొత్తపేట, అమీన్‌అబ్బాస్‌నగర్ రైతుబజార్లలో బోగస్ వివరాలతో వ్యాపారులే రైతులుగా అవతారమెత్తినట్లు ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో వెలుగు చూడడం గమనార్హం.

అంతా బోగస్సే.. తప్పుడు వివరాలతో రైతు కార్డులు

నగరంలోని సి. క్యాంప్ రైతుబజార్‌లో 1433 మంది రైతులు 26 మంది పొదుపు మహిళలు కూరగాయలు విక్రయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తపేట రైతుబజార్‌లో 26 మంది అమీన్ అబ్బాస్‌నగర్‌లో 22 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారని, నంద్యాలలో 24 మంది, ఆదోనిలో 20 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారని ఈ రైతుబజార్లలో ప్రతి రోజూ 1000 క్వింటాళ్ల కూరగాయలను 16 వేల మంది రైతులు కొనుగోలు చేస్తున్నారని కమిషనర్‌కు ప్రతిరోజూ నివేదికలు పంపిస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ అధికారుల తనిఖీలో పై రైతు బజార్లలో పది నుంచి 20 మంది రైతులు మాత్రమే గుర్తింపుకార్డులు తెచ్చుకున్నారు. మిగిలిన వారంతా మర్చిపోయి వచ్చామని తప్పించుకున్నారు. వారికి అధికారులు వంతపాడారు. పొదుపులక్ష్మి మహిళలు కొన్ని సంవత్సరాలైనా గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయించుకోలేదు. కొన్ని రైతుబజార్లలో రాజకీయనాయకులు, ఉన్నతాధికారుల సిఫారసు చేయడం వల్లనే ఇతరులకు కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం ఇచ్చినట్లు ఎస్టేట్ అధికారులు చెబుతున్నారు. అయితే.. వీరి నుంచి పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలతో పాటే రోజు అద్దెను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివరాలను రికార్డులో మాత్రం నమోదు చేయకపోవడంతో ప్రతిరోజు వేల రూపాయలు అధికారులు, సిబ్బంది జేబుల్లోకి వెళ్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

షాపులు, హోటళ్ల కేటాయింపులో గోల్‌మాల్

జిల్లాలో రైతుబజార్లు ఏడీఎం పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నాయి. సి. క్యాంప్ రైతుబజార్‌తో పాటు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట, నంద్యాల, ఆదోని రైతుబజార్లలో షాపులు, హోటళ్ల కేటాయింపులో అక్రమాలుచోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాటిలో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. షాపులు అద్దెకు తీసుకున్న వారు వ్యాపారం చేయకుండా ఇతరులతో రెట్టింపు అద్దె తీసుకొని వారికి అప్పగించినట్లు ఫిర్యాదులు అందాయి. కొన్ని రైతు బజార్లలో షాపులను అక్కడ పని చేస్తున్న సిబ్బందే బినామీ పేర్లతో దక్కించుకుని ఇతరులకు అధిక అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీ. క్యాంపు రైతుబజారులో కొన్ని షాపులను అద్దెకిచ్చేందుకు రూ.50వేల నుంచి రూ.1లక్ష దాకా వసూలు చేసినట్లు వెలువెత్తుతున్నాయి. ఈ


అధికారులకు కాసులు కురిపిస్తున్న సీ.క్యాంపు రైతుబజారు షాపులు

రైతుబజారులో నడవడానికి కూడా స్థలం లేకున్నా అధికారులు తమ జేబులు నింపుకునేందుకే టీషాపులు, ఔషధాల విక్రయం కోసం మరి కొన్ని షాపులు ఏర్పాటు చేశారు.

దళారుల పెత్తనం తట్టుకోలేక పోలీస్ స్టేషన్లకు పరుగులు

కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో క్రమక్రమంగా తిష్ట వేసిన దళారులు తమ మాటే అమలు జరగాలని హుకుం జారీ చేస్తున్నారు. వీరి హెచ్చరికలు, ఆధిపత్యాన్ని తట్టుకోలేక ఇటీవల ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు ఉన్నతాధికారుల అనుమతులు కోరారు. దళారులను ఏరివేసేందుకు జాబితాను సిద్ధం చేస్తున్నారు. దళారుల పెత్తనాన్ని అరికడతామని టీడీపీ నాయకులు అధికారులకు భరోసా ఇచ్చారు.

అక్రమాలకు పాల్పడే వారికే అందలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న కొంత మంది ఎస్టేట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బందిపై మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తపేట రైతుబజారులో పని చేస్తున్న ఎస్టేట్ అధికారిపై ఫిర్యాదులు వచ్చాయి. ఆ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు వేరే రైతుబజార్లకు డిప్యుటేషన్‌పై పంపి అంతటితో తమ పని అయిపోయినట్లు చేతులు దులుపేసుకున్నారు. తిరుపతిలో పని చేస్తున్న ఒక ఎస్టేట్ అధికారిపై ఆరోపణలు రాగా, ఆయన్ను ఆదోని రైతుబజారుకు బదిలీ చేశారు. ఇక్కడ కూడా ఆ అధికారిపై ఫిర్యాదులు వెలువెత్తడంతో కర్నూలు రైతుబజారుకు త్వరలోనే బదిలీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎస్టేట్ అధికారులు మార్కెటింగ్ శాఖలో పని చేస్తున్న ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లోనే పని చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు ఆ రైతుబజార్ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ఎస్టేట్ అధికారులను బయటపడేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



చర్యలు చేపడుతాం

రైతుబజార్ల నిర్వహణలో ఫిర్యాదులు అందుతున్న మాట వాస్తవమే. వాటిని ప్రక్షాళన చేస్తాం. అక్రమాలు జరిగినట్లు రుజువైతే ఎస్టేట్ అధికారులను ఇతర రైతుబజార్లకు డిప్యుటేషన్లపై పంపిస్తాము. జాయింట్ కలెక్టర్ అనుమతి తీసుకుని పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు కూరగాయల అమ్మకం కోసం అనుమతిని ఇస్తున్నాం.

- నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు

మరో మూడు రోజులు పిడుగులు పడే అవకాశం

- గంటకు 6 కిలోమీటర్ల వేగంతో గాలులు
- ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక



నంద్యాల ఎడ్యుకేషన్/ఆదోని, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4, 5, 6 తేదీల్లో భారీస్థాయిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరుతో అనేక ప్రాంతాల్లో 5.0 మిల్లీమీటర్ల నుంచి 18.0 మి.మీ., వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు అలాగే గరిష్ఠ ఉష్ణోగ్రత 36.5 డిగ్రీల నుంచి 38.0 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశ నుంచి ఆగ్నేయం దిశ మీదుగా గంటకు 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. గాలిలో తేమశాతం 65 నుంచి 68శాతం, మధ్యాహ్నం 16 నుంచి 35శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. బేతంచర్ల, డోన్, కొలిమిగుండ్ల, అవుకు, ప్యాపిలి, వెలుగోడు ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులు, గొర్రెలు, మేకల విషయంలో జాగ్రత్త వహించాలి. ఉద్యానపంటలు గాలుల తాకిడికి పడిపోకుండా ఊతం ఇవ్వాలి. వరికోతలు ఉన్న రైతులు వాతావరణానికి అనుగుణంగా జాగ్రత్త పడాలి. ప్రధానంగా మామిడి రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- మురళీకృష్ణ, వ్యవసాయాధికారి, నంద్యాల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

1. ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల కింద, చెట్ల సమీపంలో టవర్లు, చెరువుల దగ్గర ఉండకూడదు.
2. పొలాల్లో పనిచేసే రైతులు బహిరంగప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు సురక్షితమైన భవనాలలోకి వెళ్లాలి.
3. బహిరంగ ప్రదేశాలలో ఉన్న షెడ్లు, ఇంటిపైన ఇతర చిన్న నిర్మాణాలలో ఉండరాదు.
4. బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. లేకుంటే రబ్బరు చెప్పులను ధరించి చెవులను మూసుకుని మోకాలిపై కూర్చోవాలి.
5. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జింగ్‌లో ఉన్న ఫోన్లు, మొబైల్స్ వినియోగించకూడదు.
6. ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి.
7. మోటార్‌సైకిళ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న విద్యుత్ తీగలకు, ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.

రేపు క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 5వ తేదీ అండర్-23 సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కె.దేవేంద్రగౌడ గురువారం తెలిపారు. 1.9.2002 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు 99592 51047ను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు ఆరోగ్య బీమా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక పరిస్థితులతో నిమిత్తం లేకుండా 70 సంవత్సరాలు దాటిన వయో వృద్ధు లకు ఆరోగ్య బీమాను కల్పించిందని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి వయో వందన పథకంలో రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు.

6న అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-19 కర్నూలు జట్టు ఎంపిక 6న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2006 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు.

సెలెక్షన్ లిస్టు విడుదల : 9 నుంచి అభ్యర్థులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలల్లో ఉద్యోగాలకు సంబంధించిన 11 కేటగిరీల అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, సెలక్షన్ లిస్టులను వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్ 2023 నవంబరు 20న విడుదల చేశామని చెప్పారు. మెరిట్ లిస్టులను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు kurnool.ap.gov.in, nandyal.ap.gov.in, kurnoolmedicalcollege.ac.inలలో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్లు సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10.30 గటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. హాజరు కాని అభ్యర్థుల ఎంపికను రద్దు చేయనున్నట్లు తెలిపారు.

వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలకు పోస్టింగ్

నంద్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్‌ఐలకు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గురువారం తెలిపారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ ఎం.రామస్వామిని నంద్యాల త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ ఎ.అంజాద్‌అలీని డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ బి.శ్రీనివాసరావును డీసీఆర్‌బీ నంద్యాలకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ పి.శ్రీనివాసులును పీసీఆర్ నంద్యాలకు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ కేసీ తిరుపాలును బేతంచెర్ల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ ఎం.గోపాల్‌ను కొలిమిగుండ్ల అర్బన్ పోలీసు స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ ఎస్ఎం జగన్నాథనాయక్‌ను డోన్ అర్బన్ పోలీసు స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్‌ఐ ఎన్.మహమ్మద్ రఫిని నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్‌కు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా ఆయా పోలీస్ స్టేషన్లలో తక్షణం రిపోర్టు చేయాలని తెలిపారు.

మహానందిలో ప్రముఖుల పూజలు


మహానందిలో ఐపీఎస్ అధికారి జీఎస్ రావు

మహానంది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయం, ముఖ మంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారి జీఎస్‌రావుతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన న్యాయాధికారి పట్టాభిరామ్ దంపతులు ప్రధాన ఆలయాల్లోని మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం వీరిని ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ఆలయ వేదపండితుడు శాంతారామ్‌భట్ ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మద్దతు ధరకు జొన్నలు కొంటాం

● దళారులను నమ్మి మోసపోవద్దు ● జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య విజ్ఞప్తి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ పౌర సరఫరాల సంస్థ నుంచి విడుదలైన ఆదేశా ల మేరకు కర్నూలు జిల్లాలో రైతులు పండించిన జొన్నలు హైబ్రిడ్ రకాలను (సీ-43-మహేంద్ర)లను ప్రభుత్వ కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని గురువారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు కనీసం మద్దతు ధర క్వింటానికి రూ.3,379 చొప్పున ప్రకటించినట్లు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలను అనుసరించి రైతు సేవా కేంద్రాల వద్ద సివిల్ సప్లయ్ సంస్థకు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ముస్లింలపై మోదీ చిన్నచూపు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలను చిన్నచూపు చూడటమే కాకుండా, వారి మనోభావాలు దెబ్బతీయడమే ప్రధాని నరేంద్రమోదీ అజెండాగా పెట్టుకున్నారని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెంగటి లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడతూ ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి బూత్‌స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 184 పంచాయతీ కార్యదర్శులు పదోన్నతులు పొందనున్నారు. ఈ మేరకు అర్హులైన గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు సీనియారిటీ జాబితాను అధికారులు విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 (నిల్), గ్రేడ్-2లో (8), గ్రేడ్-3లో (7), గ్రేడ్-4లో (64), గ్రేడ్-5లో (12), నంద్యాల జిల్లాలో గ్రేడ్-3, గ్రేడ్‌లో (3), గ్రేడ్-2లో (10), గ్రేడ్-3లో (9), గ్రేడ్-4లో (54) గ్రేడ్-5లో (17) ఖాళీలు ఉన్నాయి. వీటిని రోస్టర్, మెరిట్ ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులను కల్పించనున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో రెవెన్యూ సిబ్బందికి 44 మందికి సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలుగా పదోన్నతులు ఇచ్చారు. అదే విధంగా 161 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు త్వరలో గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతి పొందనున్నారు.

జడివాన

- కరెంటు సరఫరా నిలిపివేతతో చిమ్మచీకట్లు
- మార్కెట్ యార్డులో కూరగాయల రైతు అవస్థలు
- పిడుగులు పడి ఒకరు మృతి.. స్పృహ తప్పిన ఆరుగురు



రైతు ఆశలు నేలమట్టం.. బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో వరి పైరు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం రాకతో కాస్త ఉపశమనం పొందారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడివాన కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కనిపించగా సాయంత్రం పలుచోట్ల రెండు గంటల దాకా వరుణుడు కరుణించాడు. ఉమ్మడి జిల్లా అంతటా ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. కర్నూలు నగరంతో పాటు పత్తికొండ, కోడుమూరు, డోన్, పాణ్యం, కొలిమిగుండ్ల, ప్యాపిలి తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎమ్మిగనూరులోని కందనాతి గ్రామంలో పిడుగు పడి రవి (15) అనే యువకుడు మృతి చెందాడు. సి.బెళగల్ మండలం యనగండ్ల క్రాస్ రోడ్డు వద్ద పిడుగు పడి ఆరుగురు స్పృహ తప్పి పడిపోయారు.

మండువేసవిలో వాన

మహానంది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహానందిలో ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. దీంతో మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చిన భక్తులు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో క్షేత్ర వీధులన్నీ జలమయం అయ్యా యి. అలాగే ఎం.తిమ్మాపురం, బుక్కాపురం, తమ్మడపల్లి, శ్రీనగరం గ్రామాల్లో ఈదురు గాలులకు పలుచోట్ల అరటిచెట్లు నేలకొరిగాయి. రైతులు ఆరబోసిన పసుపు దిగుబడి తడిసింది.



జాగ్రత్త పడ్డారు.. పగిడ్యాల మండలం: నెహ్రూనగర్ సమీపంలో మొక్కజొన్నపై పట్టాలు



మహానంది మండలం బుక్కాపురంలో తడిసిన పసుపు దిగుబడి

రైతుల ఇబ్బందులు

పగిడ్యాల: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలోని గామాల్లో గురువారం తేలికపాటి వర్షం కురిసింది. ప్రస్తుతం కేసీ కాలువ కింద రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నూర్పిడి చేసి ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేసుకున్నారు. వర్షం కురవడంతో ధాన్యం తడవకుండా రైతులు ఇబ్బంది పడ్డారు.

నేలమట్టమైన వరి పంట

బండిఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన రావడంతో ఈర్నపాడు, కడమలకాల్వ, వెంగళరెడ్డిపేట, మణికరపురం, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి పంట పూర్తిగా నేలమట్టమైంది.

కళ్లెదుటే నేలమట్టం



9 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మరో పది రోజుల్లో చేతి కందాల్సిన పంట కళ్లెదుటే నేలమట్టమైంది. ఎకరాకు 10 బస్తాలకు పైగానే దిగుబడి తగ్గిపోతుంది. అసలే రబీ పంట ధర లేదు. దీంతో అప్పులు తప్పవు. ప్రభుత్వం పంట నష్టం అందించి ఆదుకోవాలి. - **నాగిరెడ్డి, ఈర్నపాడు, బండి ఆత్మకూరు**

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినిపేట, కోటపాడు, బెలుం, బెలుంశింగవరం తదితర గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. రైతులు కలాల్లో ఆరబోసిన పంట దిగుబడులు దెబ్బతిన్నాయి. తిమ్మనాయినిపేట గ్రామంలో పసుపు రైతులకు నష్టం వాటిల్లినట్లు వాపోతున్నారు.



కొలిమిగుండ్ల: తడిసిన పసుపు పంట



ఓర్వకల్లు బస్టాండు వద్ద వర్షపు నీరు

మెరుపు ప్రభావంతో ఆరుగురికి అస్వస్థత

సి. బెళగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగండ్ల క్రాస్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉన్న ఆరుగురు ప్రయాణికులు మెరుపు ప్రభావానికి గురై అస్వస్థతకు గురయ్యారు. ఆ దారిలో కారులో వెళుతున్న టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప మెరుపు ప్రభావంతో స్పృహ కోల్పోయిన వారిని తన వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని మెరుపు దాడికి గురైయిన వారి వివరాలు తెలుసుకుని, వారి బంధువులకు సమాచారం అందజేసి నట్లు తెలిపారు.

కర్నూలులో కుమ్మేసిన వాన



కర్నూలులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

కర్నూలు నగరంలో రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు కర్నూలు నగరంలో దాదాపు రెండు గంటల సేపు వాన దంచి కొట్టింది. కరెంటు సరఫరా నిలిపివేయడంతో బళ్లారి చౌరస్తా పరిధిలోని సంపత్‌నగర్, విఠల్‌నగర్, ఠాగూర్ నగర్, మురారినగర్, తదితర కల్లూరు పరిధిలోని కాలనీల ప్రజలు చిమ్మచీకటిలోఇబ్బందులు పడ్డారు. కర్నూలు మార్కెట్‌యార్డులో రాత్రి సమయంలోనే రైతులు కూరగాయలను విక్రయానికి తెస్తుంటారు. జడివానకు రైతులు తెచ్చిన కూరగాయలు తడిసిపోయాయి.

పిడుగుపాటుకు బాలుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్



బోయ రవి(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిడుగు పాటుకు గురై 15ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద సంఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మారెన్న, మస్తానమ్మల కుమారుడు బోయ రవి(15) పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో వర్షపు జల్లులు పడడంతో రవితో పాటు అదే గ్రామానికి చెందిన గజ్జన్న, తిక్కయ్య, స్టాలిన్ కూడా చెట్టుకిందకు వెళ్లారు. ఒక్కసారిగా పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన బాలుడు రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి గజ్జన్న, తిక్కయ్య, స్టాలిన్‌లకు ప్రభుత్వ వైద్యశాల లో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. తహసీల్దార్ శేషఫణి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎయిర్‌పోర్టులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య



కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి. నవ్య ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్‌ను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంటు కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ఆవరణలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, డీఎంహెచ్‌వో డా. శాంతికళ, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ఐబీ డీఎస్పీ మధు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, డీడీ మైన్స్ రవిచంద్ర, ఎలక్ట్రికల్ డీఈ శేషాద్రి, ఎంపీడీవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాపరాతి గనుల్లో ట్రాక్టర్‌కు వెళుతూ, గని కార్మికుడిగా జీవనం సాగిస్తున్న వెంకటరామిరెడ్డి(48) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన గురువారం చోటు చేసుకుంది. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన ఉమ్మడి రామిరెడ్డి కుమారుడు వెంకటరామిరెడ్డి గత 15 సంవత్సరాల క్రితం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకొని, గనుల్లో ట్రాక్టర్‌కు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా వెంకటరామిరెడ్డి మద్యానికి బానిసగా మారి, తరచూ భార్య వసుంధరతో గొడవ పడి వేధిస్తుండటంతో నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి ఎటువంటి సంతానం లేదు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో వెంకటరామిరెడ్డి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వెంకటరామిరెడ్డి సూసైడ్ నోట్ రాసుకున్నారని చెప్పారు. కొలిమిగుండ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారపేటలో బాలకృష్ణ (36) అనే యువ కుడు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గతంలో కారు డ్రైవర్‌గా పని చేస్తూ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. భార్య సంపాదనపై ఆధారపడి తాగుతూ తిరుగుతుండేవాడు. మద్యం మత్తులో ఇం ట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేటకు చెందిన షేక్ ముత్తాజ్(35) అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. భర్త షకీల్ బాషా గౌండా పని చేస్తుంటాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అలాగే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కరీముల్లా (38) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకు న్నాడు. ఈయన కాలు ప్రమాదంలో విరిగిపోయింది. గత కొద్ది కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భార్య పిల్లలు ఊరు వెళ్ల డంతో అనారోగ్య సమస్యలు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరి వేసుకున్నాడు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సీపట్నం వైసీపీ నాయకుడి అరెస్టు



డోన్‌లో కోర్టుకు వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసులును తీసుకువస్తున్న పోలీసులు

డోన్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నర్సీపట్నం వైసీపీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో పీరా అనే వ్యక్తి ఫిర్యాదుపై నర్సీపట్నానికి చెందిన వైసీపీ నాయకుడిపై జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా పోలీసులు నర్సీపట్నం వెళ్లి తన కార్యాలయంలో ఉన్న వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసులను అరెస్టు చేసి నంద్యాల జిల్లా మీదుగా డోన్ కోర్టుకు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేసినట్లు జలదుర్గం పోలీసు అధికారులు తెలిపారు.

ఆదివాసులపై యుద్ధం నిలిపివేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులపై చేస్తున్న యుద్ధాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు ఆదివాసుల హత్యలకు, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కన్వీనర్ అల్లాబకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లాడుతూ నేడు ఛత్తీస్‌ఘడ్‌లో అన్ని అధికా రాలను సైన్యం గుప్పిట్లోకి తీసుకుందని, కార్పొరేట్ కంపెనీల కోసం ప్రభుత్వం చేస్తున్న ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విరసం బాధ్యుడు పాణి మాట్లాడుతూ తక్షణమే భారత ప్రభుత్వం సైన్యాన్ని వెనక్కి తీసుకొని, యుద్ధాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బారాయుడు, పోస్టల్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరెడ్డి, యోహాను, రాయలసీమ విద్యావంతుల వేదిక బాధ్యుడు రత్నం ఏసేపు తదితరులు మాట్లాడారు.

బాలుడి అనుమానాస్పద మృతి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వీకర్ సెక్షన్ కాలనీలో నాని (14) అనే విద్యార్థి అనుమానస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. వెల్దుర్తికి చెందిన బజారికి మహాదేవికి పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు సంతానం. కొన్ని రోజుల క్రితం నాని తల్లి మహాదేవి కూడా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నానితో పాటు ఇద్దరు చెల్లెళ్లు రామకృష్ణాపురంలో మేనమామ మధు వద్ద ఉంటున్నారు. నాని లద్దగిరి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్నాడు. తండ్రి బజారి మరో రెండో పెళ్లి చేసుకుని కర్నూలులో నివాసం ఉంటున్నాడు. నాని తరచుగా తండ్రి వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. బుధవారం కూడా తండ్రి బజారి వద్దకు వచ్చాడు. అర్ధరాత్రి తర్వాత నాని ఉరి వేసుకున్నాడని తండ్రి బజారి మధుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో మధు, బంధువులు కర్నూలు వచ్చి నాని మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాని మృతికి తండ్రి బజారి, అతడి రెండో భార్య లిల్లి కారణమై ఉండవచ్చని అనుమానిస్తూ మధు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.



నాని (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గూడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బోయ రవి(36) మృతి చెందాడు. గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడికి చెందిన రవి గూడూరు మండలంలోని మునగాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం మునగాల నుండి సొంత ఊరు హెచ్ కైరవాడికి బోయ రవి భార్య లక్ష్మితో బైక్‌పై వెళ్తుండగా, చనుగొండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చనుగొండ్ల నుండి సుంకేసుల వైపు బైక్‌పై వెళ్తూ మునగాల - గూడూరు మధ్యలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బోయ రవిని పోలీసులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

12 మందిపై కేసు నమోదు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 12మందిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర తెలిపారు. గురువారం మాట్లాడుతూ పొలాల్లో ఎల్లెల్సీ నీటి వాటా విషయంలో బుధవారం గ్రామానికి చెందిన పాండు వర్గీయులు, లోకేష్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకొందని, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు.

వసతి గృహం తనిఖీ



వసతి గృహం నిర్వాహకులిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా గాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధిం చిన రిజిస్టర్లను చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించి నిర్వాహకులిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరాశ్రయులకు అందించే భోజన వైద్యసదుపాయాల గురించి అక్కడుంటున్న వారిని ఆరా తీయగా.. సౌకర్యాలు బాగా లేవని వృద్ధులు ఆయనకు వివరించారు. దీంతో న్యాయా ధికారి అక్కడి వసతులను వెంటనే మెరుగు పరుచుకోవాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. ఆయన వెంట వసతి గృహం నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పారదర్శకంగా ఓటరు జాబితా

ఈఆర్వో రాంభూపాల్‌రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గం పరిధిలో పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శ్రీశైల నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఓ.రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఓటరు జాబితాలో పేర్లు, అడ్రస్ మార్పు, కొత్త ఓటర్ల కొరకు వచ్చిన దరఖాస్తులను పునర్ పరిశీలన చేయాలని సూచించారు. ఇంకా ఎవరైనా కొత్తగా ఓటరు నమోదు, ఇతర సవరణల కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లయితే వాటిని పరిశీలించి నమోదు చేస్తామని వివరించారు. ఈఅంశంపై ప్రతినెల మొదటివారంలో రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో రాంభూపాల్‌రెడ్డి

● ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాల బీఎల్‌ఓకు ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఓ.రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, 1951లోని అంశాలను వివరించడంతో పాటు ఫారం-6,7,8 గురించి వివరించారు. అలాగే బీఎల్‌ఓల విధులపై అవగాహన కల్పించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ సమాచార హక్కు చట్టం కమిషనర్ డా. చావలి సునీల్ కుమార్ ఆదేశాల మేరకు నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ నిరంజన్ రెడ్డి, సహాయ కమిషనర్ వెంకటదాస్, పట్టణ ప్రణాళిక అధికారి మూర్తి, మెప్మా అధికారి రాములు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చర్యలు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌తోపాటు పలు కళాశాలల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సాయంతో మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరిగే నేరాలు, ఈవ్‌టీజింగ్‌లను అరికట్టడానికి ప్రభుత్వం తెచ్చిన శక్తియాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలా అకాడమీ పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల యజమానులు రవీంద్రనాథ్, మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

'సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి'



లక్ష్మాపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

పగిడ్యాల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కమిటీ సభ్యులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆలయాలకు భద్రతగా కెమెరాలు అమర్చాలని తెలిపారు. ఆలయాలలో దొంగతనాలు జరుగకుండా నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మద్దిలేటిగౌడ్, గోవింద్, భూఫిగౌడ్, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

మహానంది ఏపీఎంగా మల్లికార్జున

మహానంది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహానంది మండల ఉపాధిహామి పథకం ఏపీఎంగా మల్లికార్జున బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉదయం మహానంది ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలాను కలిశారు. మహానంది సమీపంలో ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీల మస్టర్‌ను పరిశీలించి మాట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏపీఎం మనోహర్ జిల్లాలోని ఆత్మకూరు మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికార్లు ఆదేశాలు జారీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునను మహానంది మండలానికి బదిలీ చేశారు.

'వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి'

నందికొట్కూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని వ్యతిరేకమని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడే వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని ముస్లింలను లక్ష్యంగా చేసుకొని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఏకపక్షంగా తీసుకువచ్చిందని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ఎస్.బీబీ, లక్ష్మీదేవి, వేల్పుల ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముగ్గురు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జయసూర్య గురువారం అందజేశారు. పసుల శివప్రియకు రూ.1,41,662, పఠాన్ అబ్దుల్ హఫీజ్‌కు రూ.37,100, జయన్నకు రూ.36,600 చెక్కులను ఎమ్మెల్యే వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోనేందుకే సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపాలిటీ: నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రూ.లక్ష విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పంపిణీ చేశారు. అలాగే ఈ నెల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను సద్విని యోగం చేసుకోవావాలని పార్టీ జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు.

● ఇటీవల ప్రమాదంలో గాయ పడిన సీనియర్ మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్‌ను ఫిరోజ్ పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జిల్లెల్ల శ్రీరాములు, ఏవీఆర్ ప్రసాద్ ఉన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఫిరోజ్

ఘనంగా ఉరుసు



ఫాతేహాలు ఇస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాబ్జహాన్ కొట్టాలలో జరుగుతున్న దస్తగిరి సాహెబ్ ఉర్సులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొన్నారు. గురువారం ఆమె దర్గాలో ఫాతేహాలు సమర్పించిన అనంతరం జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికల షెడ్యూల్ విడుదల

నంద్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల న్యాయవాదుల ఎన్నికలకు సంబంధించి స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం షెడ్యూల్‌ను ఎన్నికల నియమావళి కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, తాళంకి వెంకటప్రసాద్, సుధాంశుమౌలిరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికి సంబంధించి బార్ అసోసియేషన్ ఎన్నికల తేదీలను ప్రకటించారు. ఈ నెల 7న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 8న అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన, 9న అభ్యర్థుల విత్‌డ్రా అనంతరం ఆదేరోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. 11వ తేదీన ఎన్నికలు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని ఆదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో రఘుప్రకాష్, జి.శ్రీనివాసులు, మహిళా ప్రతినిధి షేక్ షన్ను, తిరుపాలు పాల్గొన్నారు.

'ఇంకుడు గుంతను పూడ్చివేయాలి'

కొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చిన్న గుమ్మడాపురం ప్రభుత్వ పాఠశాల వద్ద గ్రామస్థులకు ఇబ్బందిగా ఉన్న ఇంకుడు గుంతను పూడ్చివేసి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఏఎస్ రాజు, జ్ఞానసూర్యుడు, రామసుబ్బయ్య, లక్ష్మినారాయణలు ఎంపీడీవో మేరీని కోరారు. గురువారం వారు గ్రామస్థులతో కలిసి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. స్థానిక సర్పంచ్ విజయకుమార్ విద్యాక మిటీ చైర్మన్‌కు గానీ, వార్డు సభ్యులకు గానీ గ్రామ పెద్దలకు కూడా చెప్పకుండా ఇష్టానుసారంగా ఇంకుడు గుంతలు తవ్వి విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగే విదంగా గుంతలను తవ్వించారని ఆరోపించారు. ఆ ప్రాంతంల ఇంకుడు గుంత తీసే స్థలం లేకున్నా సిమెంటు కాలువలు, రోడ్డును పగులకొట్టి ఇష్టానుసారంగా ఇంకుడుగుంత తవ్వారని, తక్షణమే పూడ్చివేయాలని వారు ఎంపీడీవోను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాఘవేంద్ర, రవీంద్రబాబు, మియాసాబ్, స్వాములు పాల్గొన్నారు.

ఏపీవో బదిలీ

పాములపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ శాఖలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న విమలమ్మతో పాటు మరో నలుగురు బదిలీ అయ్యారు. పాములపాడు మండలం నుంచి కొత్తపల్లి మండలానికి బదిలీ కాగా గురువారం బదిలీ అయిన వారికి ఎంపీపీ సరోజినీ వర్ధినియా, ఎంపీడీవో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు అవగాహన

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టౌన్ హాల్‌లో నంద్యాల సహాయకమిషర్ వెంకట దాస్ ఆధ్వర్యంలో పట్టణ సచివాలయ ఉద్యోగులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం నిర్వహిస్తున్న పలు సంక్షేమ పథకాల అమలులో సచివాలయ కార్యదర్శులు అలసత్వం వహిస్తున్న నేపథ్యంలో వారిలో చైతన్యం కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

'రోడ్ల విస్తరణకు అనుమతులు ఇవ్వాలి'

సున్నిపెంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు, శ్రీశైలం, ప్రకాశం జిల్లా దోర్నాల పరిధిలోని రహదారులు విస్తరణకు అనుమతులు మంజూరు చేయాలని సున్నిపెంటకు చెందిన టీయూసీఐ అధ్యక్షుడు ఆశీర్వాదం కోరారు. శ్రీశైలం-నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ప్రాజెక్టు సీసీఎఫ్ ఏకే నాయక్‌ను మంగళగిరిలోని కారాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం సమీపంలోని అటవీ చెక్‌పోస్టు సమయాల్లో మార్పులు చేయాలని, ఉదయం 6 గంటలకు కాకుండా 5 గంటలకు, రాత్రి 9గంటలకు కాకుండా 10 గంటల వరకు వాహనాల రాకపోకలు అనుమతించే లా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చెంచు గిరిజనులు మైదాన ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి పునరావాసం కల్పించాలని కోరారు. అలాగే సున్నిపెంట ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాలలో అనేక సమస్యలు వున్నాయని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తాడేపల్లి కార్యాలయంలో రాష్ట్ర వైద్య శాఖ డైరక్టర్ డాక్టర్. శిరీషను కలిసి వినతి పత్రం అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల నాగులకుంట రోడ్డులో వెలసిన సాయిబాబా మందిరంలో గురువారం మాడుగుల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో గణపతి సహిత నాగ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. షిరిడీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం గణపతి నాగ ప్రతిష్ఠ సంప్రోక్షణ, నవచండీ యాగం, అనంతరం అశ్వర్థనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి, గోపాలకృష్ణ మూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద ఉన్న దత్తాత్రేయ స్వామికి లోక కల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

సుబ్రహ్మణ్య స్వామికి..

శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం షష్ఠిని పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం కరీంనగర్‌కు చెందిన ఎం. వెన్నెల బృందంచే భక్తి సంగీతం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అలాగే నంద్యాలకు చెందిన కె. సాయికుమార్ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతి, శివాష్టకం, నమో నమో నటరాజ, శ్రీశైల గిరిజ విభో తదితర గీతాలకు లక్ష్మీ, వెంకటపూజిత, అమృతవర్షిణి, శశికమల తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి'



ఆత్మకూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పంట దిగుబడుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం హరినాథ్‌రెడ్డి, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంది, మినుము, శనగ దిగుబడుల కొనుగోలు కేంద్రాన్ని శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, టీడీపీ పట్టణ కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రాజారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కింటం కందులు రూ.7550, మినుములు రూ.7400, శనగలు రూ.5650 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బు ఆలస్యం చేయకుండా వారం రోజుల్లో చెల్లించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సబ్సిడీ కింద మంజూరైన యంత్రపరికరాలు, పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మండల అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ నవీన్‌కుమార్, రైతు సంఘాల నాయకులు టపాల్ అష్రఫ్‌అలి తదితరులు ఉన్నారు.

'విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వ్యక్తుల పట్ల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ రఘురామయ్యగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా శక్తి యాప్ గురించి అవగాహన పెంచుకుని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నూర్‌అహ్మద్, సిబ్బంది సుప్రియ ఉన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ తదితరులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, బాగా చదువుకోవాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా సూచించారు. నంద్యాలలో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ అనుబంధ సంస్థ నవనంది క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పేద ఆర్యవైశ్య విద్యార్థినికి చదువుల కోసం రూ.22 వేలు ఆర్థిక సాయంఅందజేశారు. నవనంది క్లబ్ నంద్యాల అధ్యక్షుడు శ్రీనివాసులు, పొట్టి శ్రీరాములు క్లబ్ అధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ సీఐతో పాటు వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఉమ్మడి జిల్లాల గవర్నర్ శ్యామ్ సుందర్ గుప్తా హాజరయ్యారు. కార్యక్రమంలో సుబ్బలక్ష్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం కేంద్రం తనిఖీ

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆటిజం కేంద్రాన్ని గురువారం కలెక్టర్ రాజకుమారి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆటిజం ఉన్న పిల్లకు స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోటివేషన్, ఫిజియోథెరపీ వంటి సేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. డీఐసీ సెంటర్‌లో అందిస్తున్న సేవలవల్ల పిల్లలు విశ్వాసంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సెంటర్‌నుంచి శిక్షణ పొందిన పిల్లలను కలెక్టర్ ప్రశంసించారు.

జగ్జీవన్‌రాం జయంతిని విజయవంతం చేయాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 5వ తేది శనివారం డా.బాబూ జగజ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చింతామణి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బస్టాండ్ సమీపంలో ఉన్న డా.బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహ కూడలి వద్దకు ఉదయం 9గంటలకు ప్రజాప్రతినిధులు, మేధా వులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు.

'బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం'



రైతును పరామర్శిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు, లింగాపురం గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని సంతజూటూరు పొగాకు పంట అగ్నికి ఆహుతైన రైతు అబ్దుల్లా, ఇటీవల హత్యకు గురైన సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అంతకుముందు ఎ.కోడూరులో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, మౌళాలి, శివశంకర్, రఘురెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణ తయారు చేయాలి

వెలుగోడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ కార్యాచరణ తయారు చేయాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. వెలుగోడులోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై పలు సలహాలు, సూచనలు తెలియచేశారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏపీఎం సుగుణపాల్, శాస్త్రవేత్త భార్గవ్, సిబ్బంది నాగేంద్ర, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డా.కే.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. గురువారం కొత్తపల్లి, గోకవరం, ఎర్రమటం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వైద్యాధికారులు జబ్బీర్ హకీమ్ రషీద్, దీపా నాగవేణి, ఎంపీహెచ్‌ఈవో నిత్య పూజారయ్య, వైద్యసిబ్బంది సత్యంరెడ్డి పలువురు వైద్యసిబ్బంది ఉన్నారు.

నందికొట్కూరులో చోరీ

నందికొట్కూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ఓ ఇంట్లో బంగారం, వెండి, నగదులు అపహరణకు గురయ్యాయి. వివరాలివీ.. పట్టణంలోని సాయిబాబపేటకు చెందిన షేక్ మహబూబ్‌భాష బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఇంట్లో బీరువాలో ఉన్న 60 తులాల వెండి, రూ.50వేల నగదు, ఒక ముక్కుపుడక, 2 విలువైన గడియారాలు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులు నమోదు చేసుకోవాలి



లింగాపురంలో మాట్లాడుతున్న ఏడీఏ

బండిఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే లబ్ధి కోసమే విశిష్ట సంఖ్య అని, రైతులు నమోదు చేసుకోవాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. గురువారం మండలంలోని లింగాపురం ఆర్ఎస్‌కేలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి పొలం ఉన్న సొంత రైతు పొలం ఒన్‌బీ, ఆధార్, ఆధార్ అనుసంధాన మొబైల్ నెంబర్‌లు ఆర్ఎస్‌కేలలో అందజేసి విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. పంటమార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఏవో స్వాతి పాల్గొన్నారు.

ర్యాలీ చేయకుండానే వెనుదిరిగిన విద్యార్థులు

పాణ్యం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరిగిన బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ రుణాలు, ఆన్‌లైన్ గేమ్స్‌ల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించాల్సిన ఇంజనీరింగ్ విద్యార్థులు వెనుదిరిగి వెళ్లి పోయారు. పాణ్యం మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించుకోవడానికి గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించుకోవ డానికి పోలీసుల సహకారం కోరారు. అయితే ర్యాలీకి ఎవరు అనుమతి ఇచ్చారని ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో విద్యార్థులు వెనుదిరిగి వెళ్లిపోయారు. దీనిపై ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ తనకు సమాచారమే లేదని, దీంతో ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. అలాగే బందోబస్తుతో సిబ్బంది కొరత ఉండడంతో మరో రోజు నిర్వహించుకోవాలన్నారు.

అకాల వర్షంతో రైతుల అవస్థలు



బాపనంతాపురంలో టార్పాలిన్లతో ధాన్యాన్ని కప్పేసిన దృశ్యం

ఆత్మకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు చివరకు వరుణగండం పొంచి ఉండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆత్మకూరు మండలంలో రబీ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న, జొన్న పంటలు ప్రస్తుతం కోత దశకు చేరుకోవడంతో రైతులు తమ దిగుబడులను కల్లాలు, పంటపొలాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. అయితే గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో పాటు చిరుజల్లులతో కూడిన వర్షం కురియడంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు పడరానిపాట్లు పడ్డారు. టార్పాలిన్లను కప్పి ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టారు. అయితే బలమైన వర్షం కురిసినట్లయితే దిగుబడులు తగ్గిచే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి కూడా ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం కురియడంతో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సాయిబాబాకు క్షీరాభిషేకం


సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, సాయి వ్రతం చేశారు. మహిళలు సామూహికంగా ప్రత్యేక హారతులు ఇచ్చారు. అనంతరం సాయి పల్లకితో ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో గ్రేడింగ్ పెంచాలి

చాగలమర్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. గురువారం మండలంలోని మద్దూరు ఎస్సీ కాలనీలోగల స్పెషల్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామార్థ్యాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

ఓటరు జాబితాలో సవరణకు సహకరించండి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జబితాలో ఉన్న తప్పులను సవరించడానికి రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 11గంటలకు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్‌వోలుం ఉటారన్నారు. ఓటరు జాబితాలో తప్పులు గుర్తించి వాటిని తొలగించడానికి నాయకులు సహకరించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

కోవెలకుంట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు నాగలక్ష్మి గురువారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంటు నాగలక్ష్మి వ్యక్తిగత కారణాల వల్ల ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంటుగా విధులు నిర్వహించలేకపోతున్నామని, అందువల్లనే తాను రాజీనామా చేస్తున్నానని పత్రంలో పేర్కొన్నారన్నారు.

వంద శాతం పూర్తి చేయాలి


రుద్రవరంలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ

రుద్రవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య రెండురోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం రుద్రవరం వ్యవసాయ కార్యాలయం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు 68 శాతం పూర్తయిందన్నారు. రెండురోజుల్లో వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌నందు వివరాలు నమోదు చేయించుకుని ఐడీని పొందాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ సూచించారు. శిరివెళ్లలోని వ్యవసాయశాఖ కార్యాయలంలో మండలంలోని వ్యవసాయ, ఉద్యానవనశాఖ సహాయకులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలో నమోదైన రైతుల వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, శిరివెళ్ల ఏవో సుధాకర్, మండల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

బండలాగుడు, కబడ్డీ పోటీలు ప్రారంభం


విజేతలకు బహుమతులు అందిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలం నందవరంలో చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు, కబడ్డీ పోటీలను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డిలు బీసీ రాజారెడ్డికి శేషవస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, టీడీపీ యువనాయకుడు పీవీ.నాగార్జున రెడ్డి, పీవీ. శుభంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా ..

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్నికోట గ్రామంలో అల్ట్రాటెక్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారించడానికి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశాల మేరకు అల్ట్రాటెక్ వారు తాగునీటి సరఫరాను ప్రారంభించినట్లు టీడీపీ నాయకులు యాతం సత్యనారాయణరెడ్డి వెల్లడించారు.

చేతి పంపులకు మరమ్మతులు ..

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని పలు కాలనీల్లో చేతి పంపుల బోర్లకు అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. గురువారం గ్రామ సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో చేతి పంపుల బోర్లలో నూతన పైపులు దించి, మరమ్మతులు నిర్వహించారు. తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా చేతి పంపులకు మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ శివ తెలిపారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?


పెద్దవంగలి గ్రామంలో దెబ్బతిన్న టీజీపీ స్ట్రక్చర్

చాగలమర్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీజీపీ పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. నిధుల గ్రహణంతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా చివరి ఆయకట్టుకు చుక్క నీరు పారడం లేదు. ప్రతి ఏడాది తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువల్లో పూడిక చేరి, చెట్లు, ఏపుగా పెరగడంతో అధ్వానంగా తయారయ్యాయి. బిల్లులు రాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని తెలుస్తోంది. 19 ఏళ్ల నుంచి పంట కాలువ పనులకు మోక్షం లేదు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది.

- శిథిలావస్థలో టీజీపీ పంట కాలువలు
- అస్తవ్యస్తంగా ఉప కాలువల నిర్మాణ పనులు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- ప్రతిపాదనలకే పరిమితం
- ఆందోళనలో రైతులు


ముళ్ల కంపలతో నిండుకున్న పంట కాలువ

అసంపూర్తిగా పనులు

టీజీపీ ప్రధాన కాలువ నుంచి ముత్యాలపాడు, డి.వనిపెంట, చింతలచెరువు, పెద్దవంగలి, కొలుములపేట, చిన్నవంగలి తదితర గ్రామాల్లో పంట కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 2004లో తాగు, సాగు నీరు అందించేందుకు 35, 36, 37 బ్లాక్‌లలో పనులు చేపట్టారు. అప్పటి కాంట్రాక్టర్లు కొంత వరకు కాలువ పనులు చేపట్టి మధ్యలో పనులు నిలిపి వేశారు. అప్పటి నుంచి కాలువ పనులను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగోడు జలాశయం నుంచి టీజీపీ ప్రధాన కాలువకు ప్రతి ఏడాది నీరు విడుదల చేసిన చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. డిస్ట్రిబ్యూటరీల నుంచి పంట కాలువలకు ప్రవహించే ఉప కాలువలకు లైనింగ్ పనులు చేయకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండి పోయాయి. చిన్నవంగలి గ్రామ సమీపంలో కొందరు కాలువలను ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు. కొన్ని చోట్ల టీజీపీ ప్రధాన కాలువలో లైనింగ్ దెబ్బతింది. నిధుల లేమితో కాలువ మరమ్మతు పనులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ఎండుతున్న పంటలు

వెలుగోడు జలాశయం నుంచి వారబందిగా నీరు విడుదల చేసిన చాగలమర్రి ప్రధాన కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కాలువలో నీరు ప్రవహించకపోవడంతో చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో సాగునీటి బోర్లు కూడా ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు చొరవ తీసుకొని ఉప కాలువల నిర్మాణ పనులు, ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చింతల చెరువులో లైనింగ్‌కు నోచుకొని టీజీపీ పంట కాలువ


నివేదికలు పంపించాం

టీజీపీ పంట కాలువల లైనింగ్ పనులకు ప్రతిపాదనలు చేశాం. ఆయా బ్లాక్‌లలో మరమ్మతు పనులు, టీజీపీ ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేయుటకు రూ.30 కోట్లతో నివేదికలు పంపించాం. డిస్ట్రిబ్యూటర్లు, ఈటీలు, స్ట్రక్చర్ల పనులు చేయుటకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైతే కాలువ పనులు చేపడతాం.

- వెంకటరమణ, డీఈ, చాగలమర్రి

నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ


మంత్రి నారా లోకేశ్‌తో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు నిధుల సమీకరణపై మంత్రితో చర్చించారు. యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

బనగానపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు వడ్డిస్తున్న భోజనాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం పరిశీలించారు. ప్రతిరోజు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలిలు తనిఖీ చేసి రోగులను భోజన నాణ్యతపై విచారించారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శిరీష, నర్సింగ్ సూపరింటెండెంట్ ఈశ్వరమ్మ, అబ్దుల్‌రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చెక్కును అందిస్తున్న సముద్రాల శ్రీనివాసరావు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగలకట్ట వద్ద మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రాన్ని ఏర్పాటుకు బ్యాంకు కోఆపరేటివ్ తరపున రూ.10వేలు చెక్కును బ్యాంకు చైర్మన్ సముద్రాల శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం జీవీ సుబ్బారెడ్డి, ట్రెజరర్ కేవీ మల్లిఖార్జునరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణులకు వెండి కిరీటాలు


స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

బేతంచెర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలం సంకలాపురం గ్రామంలోని శ్రీరామచంద్ర దేవాలయానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు సీతారామ లక్ష్మణులకు వెండి కిరీటాలను గురువారం బహూకరించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

- మండ్లవానిపల్లె గ్రామంలో సుంకులాపరమేశ్వరి, జంబుల పరమేశ్వరి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, న్యాయవాది రాజశేఖర్ రెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగారావు గోష్టి ఆధ్వర్యంలో అన్నదానం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో రంగారావు అనే భాగవతుని 3వ వర్ధంతి సందర్భంగా 400 మంది పేదలకు, భక్తులకు రంగారావు గోష్టి సభ్యులు గురువారం అన్నదానం చేశారు. అహోబిల దేవస్థానం అర్చకులు కిడాంబి కుమార్ స్వామి ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని రెండు అనాథ ఆశ్రమాలతోపాటు స్ఫూర్తి మదర్ హోంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రంగారావు గోష్టి ఆధ్వర్యంలో సభ్యులు ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాలతోపాటు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రంగారావు గోష్టి సభ్యులు రవికాంత్ చౌదరి, ఉప్పల ప్రసాద్, వెంకటేశ్వర్లు, మల్లె వీరచంద్ర పాల్గొన్నారు.

జడివాన బీభత్సం

ప్యాపిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జడివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ప్యాపిలి, కలచట్ల, ఏనుగమర్రి, పోతుదొడ్డి, వెంగళాంపల్లి తదితర గ్రామాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కోత కొచ్చిన పంట అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి


శిరివెళ్లలో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యుడు ముఖేష్

శిరివెళ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు వైద్యుడు ముఖేష్ తెలిపారు. శిరివెళ్లలోని పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు పరీక్షలను గురువారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా, గోప్యంగా నిర్వహిస్తారన్నారు. క్షయ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి వైద్య సేవలు అందిస్తే మరణాలు తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ రవి కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రపల్లిలో బండలాగుడు, కబడ్డీ పోటీలు

ప్యాపిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండుగ సందర్భంగా మండలంలోని చంద్రపల్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి రాతిదూలం, కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. 7న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే జట్లకు వరుసగా రూ.35,016, రూ. 25,016, రూ. 15,016, రూ. 5,016 అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే 8న రాతిదూలం పోటీలు జరగనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందే వృషభాలకు వరుసగా రూ.50,016, రూ.40,016, రూ.30,016, రూ.20,016, రూ.10,016 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నాటుసారాపై ఎక్సైజ్ దాడులు

డోన్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు చేశారు. డోన్ పట్టణం చిగురుమానుపేటకు చెందిన మౌలాలమ్మ నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. అలాగే చిగురుమానుపేటకు చెందిన కోయలకొండ లక్ష్మీదేవి, అంజనేయ, ఆలేబాదుతాండకు చెందిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడులో ఎక్సైజ్ సీఐ లక్ష్మణదాసు, ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈదాడుల్లో 600 లీటర్లు బెల్లం ఊటను, 40 లీటర్లు నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారీదారుడు నొస్సం నాగన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణదాసు, ఎక్సైజ్ ఎస్ఐలు కమలాకర్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల ఆలయంలో కలశ ప్రతిష్ఠ


ఆలయంలో పూజలు చేస్తున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి

అవుకు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొండమీది వీధిలో వెలసిన సీతారాముల వారి ఆలయంలో శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు మిద్దె ప్రసాద్, ఏటూరి రమణ గురువారం తెలిపారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయంపైన రూ. 19 లక్షలతో నూతనంగా గోపురాన్ని నిర్మించామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిద్దె వెంకటరమణ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, సూరి, రామచంద్రుడు, బుగ్గ శ్రీనివాసులు, గోపాల్ భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై ర్యాలీ


ర్యాలీ చేస్తున్న బనగానపల్లె ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు , విద్యార్థులు

బనగానపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్ యూనిట్ నోడల్ అధికారి కౌసల్యాదేవి పర్యవేక్షణలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు నోడ్రగ్స్ సేవ్ హెల్త్ అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అధ్యాపకులు బాబూనాథ్, వసుంధరమ్మ, సూర్యనారాయణ, ఉమామహేశ్వరరెడ్డి, సుదాకర్‌రెడ్డి, రామకృష్ణ, రామన్న, మహమ్మద్ గౌస్, రుశేశ్వరుడు, అంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారు..

- ప్యాపిలి మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్రగౌడు
- విజయవాడ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు

డోన్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనల పేరుతో ఎక్సైజ్ అధికారులు తనను వేధిస్తున్నారని డోన్ పట్టణ వైన్‌షాపు లైసెన్సుదారుడు ప్యాపిలి మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్రగౌడు ఆరోపించారు. ఈ మేరకు విజయవాడలో గురువారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)లో ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు ఫిర్యాదును అందించారు. గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న సంబంధిత ఎక్సైజ్ ఉన్నతాధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. 40 సంవత్సరాలకు పైగా తమ కుటుంబం టీడీపీకి పని చేస్తున్నానని, ప్యాపిలి ఎంపీపీగా కూడా తాము సేవలందించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలంలో గీత కార్మికుల కింద కేటాయించిన ఒక వైన్‌షాపు తమకు వచ్చిందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. డోన్ పట్టణంలోని తారకరామనగర్ ప్రధాన రోడ్డులో గత వైసీపీ ప్రభుత్వంలో నడిపిన పాత వైన్‌షాపును తాను అద్దెకు తీసుకుని నడుపుతుండగా.. ఎక్సైజ్ అధికారులు నిబంధనల పేరుతో వైన్‌షాపు ఆ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతానికి మార్చాలని ఒత్తిడి తెచ్చారని ఆయన గ్రీన్‌సెల్ ఫిర్యాదులో తెలిపారు.

గుడిపాడులో సమస్యల తిష్ఠ


గుడిపాడు దళిత కాలనీలోని ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు

ప్యాపిలి, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుడిపాడు ఎస్సీ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. తాగునీరు, అంతర్గత రోడ్ల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 150 కుటుంబాలున్న గుడిపాడు ఎస్సీ కాలనీలో ఏడాదిగా నీటి సమస్య ఉంది. నీటి పథకం పాడైపోయిన పట్టించుకోకపోవడంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు వ్యవసాయ బోరు, బావుల దగ్గరకు వెళ్లి కాలం వెళ్లదీస్తున్నారు. కాలనీలో అంతర్గత రోడ్డు లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందరే నిలుస్తుంది. దీంతో ఈగలు, దోమలు చేరి ప్రజలను రోగాలకు చేరువ చేస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తికాని భవన నిర్మాణాలు


బెలుంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకవచ్చిన సచివాలయ వ్యవస్థకు భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనేక గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు తదితర భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మండలంలోని బెలుం గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు గత ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు సాగదీస్తూనే వచ్చారు. దీంతో అది పూర్తికాక, ప్రారంభానికి నోచుకోక దిష్టి బొమ్మలా దర్శనమిస్తోంది. మరోవైపు రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం పునాదులకే పరిమితమయ్యాయి. మండలంలోని అంకిరెడ్డిపల్లె, తోళ్లమడుగు, తిమ్మనాయినిపేట, గొర్విమానుపల్లె గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తికాలేదు.


మరమ్మతుకు నోచుకోని చేతిపంపు


పని చేయని చేతిపంపు

రుద్రవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దక్షిణ కొట్టాలు గ్రామంలో ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న చేతి పంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత కొన్ని రోజుల నుంచి చేతిపంపుకు మరమ్మతులు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపు పని చేస్తే విద్యార్థులకు నీటి సమస్య ఉండదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చేతిపంపుకు మరమ్మతులు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే


మూడురాళ్లపల్లె రహదారిలో దెబ్బతిన్న కల్వర్టు


దెబ్బతిన్న వంతెన

చాగలమర్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో వంకపై ఏర్పాటు చేసిన కల్వర్టు, చాగలమర్రి గ్రామంలోని వక్కిలేరు వద్ద ఏర్పాటు చేసిన 11 కమాండ్ల వంతెన స్లాబ్ బీటలు వారి దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. సైడ్‌వాల్, కల్వర్టు దెబ్బతిన్నాయి. రాత్రి వేలలో ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురవాల్సిందే. పాలకులు, అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే కల్వర్టు, సైడ్‌వాల్ మరమ్మతు పనులు చేపట్టాలని, రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.